కథానిక

# అద్దం తిరిగిన స్వయంవరం

“నా X శ్రీ”

ఆ రోజు అదివారం. కాలేజీకి శెలవయినందువల్ల పేపరు చదువుకుంటూ ఇంట్లోనే వుండిపోయా. కొంచెం మబ్బుపట్టి వర్షం సన్న సన్నగా కురుస్తూ ఆగుతూవుంది. కిటికీలోనుండి బయటకు జూస్తే పూలచెట్ల ఆకులమీద వున్న వర్షబిందువులు వింతగా మెరుస్తూన్నాయి. వర్షం ఆగగానే వీథిలోని తక్కిన ఇండ్లలోని పిల్లలు బయటకొచ్చి తమాషాగా గంతులేస్తూ మరలా వర్షంరాగానే ఇండ్లలోనికి పరుగెత్తుతున్నారు. పేపరు ముందుపెట్టుకొన్నానేగాని చదివిందేమీ లేదు. బయట ప్రపంచం గమనిస్తూ కూర్చుండిపోయా. ఇంతలో బర్ ఘుని సైకిలొకటి ఇంటిముందాగింది. సైకిలుమీద మనిషిని జూస్తే రామం. హడావుడిగా సైకిలు తీసికొని లోపలకొచ్చాడు. తువ్వాలు తీసి ఇచ్చి “ఏంరా వర్షంలో తడుస్తూ వచ్చావ్? ఆగింతర్వాత రాలేకపోయావా? అన్నా. నాకేమీ జవాబివ్వకుండా తుడుచుకున్న తలను అద్దంముందు నిలబడి దువ్వుకుంటున్నాడు. మళ్ళీ నేను వాణ్ణి అడగలేదు. కారణం నాకు తెలుసు. ఎవరితోనైనాసరే వాడేదైనా క్రొత్తవిషయాన్ని చెప్పాలనుకున్నాడంటే యితరుల ప్రశ్నలు వాడి బుర్రలోకెక్కవు. తాను చెప్పదలచుకొన్న విషయాన్ని సాంతంగా సమగ్రంగా, హావభావాలతో చెప్తేనేగాని వాడికి తృప్తిలేదు. అందువల్ల నేను మళ్లీ కుర్చీలో కూర్చున్నా. ఈజీఛైరు వాడికి ఖాళీచేసిపెట్టి. తల దువ్వుకోవటం అయిన తర్వాత ఈజీఛైరులో వాలాడు. రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలా వాడు. నేను ఆపుకోలేక “ఏంరా రామం సంగతులు. హడావుడిగా వర్షంలో పరుగెత్తుకొచ్చావు?” అన్నా.

“వాతావరణం చాలా బావుందికదురా. గాలి చూడు చల్లగా ఎంత హాయిగా వుందో” అన్నాడు. నాలో నిరుత్సాహం పూర్తిగా ప్రవేశించింది. వాడేదో వింత విషయాన్ని చెపుతాడని కాచుకుని వున్న నేను ఈ ప్రశ్నతో పూర్తిగా చప్పబడిపోయా. మెల్లిగా అవునన్నట్లు తలవూపా. ఒక్క నిమిషం అలాగే మాటా పలుకూ లేకుండా కూర్చున్నాం. నేను మళ్ళీ పేపరు తీసుకొని చదవడం మొదలెట్టా. కొంచెం సేపటికి వాడి ప్రశ్నతో వులిక్కిపడ్డా.

“ఈవూరి ఆస్పత్రిలో లేడీడాక్టరు తెలుసురా నీకు?”

“ఆ. లేడీడాక్టరా? తెలుసు. ఎవరు? సన్నగా, చాలా నాజూగ్గా వుంటుందే ఆమేనా? ఏం ఆమెతో ఏమయినా అవసరముందా? మీ బంధువుల్లో ఎవరైనా స్త్రీలకు ఆమెదగ్గర ట్రీట్ మెంటు ఇప్పించాలా?”

“అబ్బే లేదురా. వూరికినే అడిగాను” అన్నాడు. నేను మళ్లీ పేపరు చదువుకోవడం మొదలుబెట్టానేగాని మనసు సరిగా దానిమీద లగ్నం చేయలేకపోయాను. వాడి ప్రశ్నలూ, ఎప్పుడూలేని వుదాసీనతా నన్ను కొంచెం తికమక పెట్టినయ్. ఆ సందిగ్ధావస్థలో కొట్టుకోలేక “రామం సంగతేమిట్రా? అన్నీ అసందర్భంగా మాట్లాడుతున్నావ్! వాతావరణమన్నావ్! లేడీ డాక్టరంటున్నావ్! ఇంక కొంచెం సేపటికి ఇంకేం అంటావో! ఏమిట్రా అసలు సంగతి?” అన్నా చిరునవ్వు నవ్వుతూ. “ఏమీ లేదురా. ఆమెకూ నాకూ మంచి పరిచయముంది. ఇంతవరకూ నిన్నామెకు పరిచయం చేయలేదు. ఏదో చటుక్కున జ్ఞాపకం వచ్చి అన్నా. ఎప్పుడైనా ఆమెను కలుసుకుందాంలే” అన్నాడు. వీడికేమైనా మతిభ్రమణం కలిగిందా ఏం అనిపించింది నాకు. ఏదో చెప్పబోతాడు. అంతలోనే గొంతుపట్టుకొన్నట్టు

ఆపేసి సంభాషణ మారుస్తాడు. వాడి సంగతి నాకేమీ అర్థంకాలా. కొంపతీసి మనవాడామెను ప్రేమించటం లేదుకదా అనుకున్నా. షేక్స్పియరంతటి మహా కవి వ్రాసిన పద్యాలకు దాదాపు రెండుమూడు వందల మంది కాలేజీ కుర్రాళ్ళకు అర్థం చెప్పగలిగిన నేను వాడి భావాలకు మొదలూ, తుదీ తెలుసుకోలేక పోయానంటే నాకే అప్పుడప్పుడూ ఆశ్చర్యంగా వుండేది. ఏదెలాగయితే నేం, ఆ విషయం అప్పటికలాగే అజ్ఞాతంగా ఉండిపోయింది.

తరువాత నాలుగు రోజులకు నేను కొంచెం జ్వరాన పడ్డాను. రామం (పూర్తి పేరు రామారావు) వచ్చి హాస్పిటలుకు వెళదాం లెమ్మని బలవంతం చేశాడు. "నేనిప్పుడు రాలేనురా నాయనా" అంటే "కాదు కూడదు. నీకు తెలియదు. ఇట్లాంటి చిన్న చిన్న జ్వరాలే కొంపలు ముంచేది. ఆరోగ్యమంటే ఏమనుకున్నావ్? అనారోగ్యంగా బతికేదానికంటే చావడం మేలు. వందలాది కుర్రాళ్ళకు అన్ని విషయాల్లోనూ ఆదర్శప్రాయంగా వుండాలసిన నీవు ఇంత మూర్ఖంగా ప్రవర్తిస్తావేమిటీ?" అని చిన్న లెక్చర్‌తోబాటు నామీద నాలుగు మందలింపులుగూడా విసిరాడు. "నేను నడవలేనురా" అంటే ఎంతో శ్రద్ధగా వెళ్లి జట్కా పట్టుకొచ్చాడు. ఎక్కేముందే నేను చెప్పా "అబ్బాయి! లేడీడాక్టరుదగ్గరకు మాత్రం వద్దు. డాక్టరుగారి దగ్గరకే పోవాలి" 'సరే లేరా నీవు బండిఎక్కు' అనినవ్వుతూ వాడుసైకిలెక్కాడు. హాస్పిటలుకు వెళ్ళింతర్వాత తెలిసింది డాక్టరుగారు వూళ్ళో లేరని. లేడీ డాక్టరుదగ్గరకు వెళ్లక తప్పిందికాదు. ఆమె కుర్చీలను చూపించింది. ఇద్దరమూ కూర్చున్నతరువాత రామం నన్ను ఆమెకు పరిచయం చేశాడు. "అలా బలహీనంగా వున్నట్లు కనుపడుతారేం" అని అడిగిందామె నన్ను.

"జ్వరం తగుల్తూందండి రెండురోజులనుండి. డాక్టరుగారున్నారేమోనని వచ్చా."

"రావలసి రావటమేం? లేడీ డాక్టరు దగ్గరకు పోవటానికి స్వతహాగా మీకేమైనా ఆటంకాలా?"

"అబ్బే. ఆటంకాలూ లేవు. అయిష్టాలూ లేవు. మీకు స్త్రీలతోనే ఎప్పుడూ తీరని పని వుంటుంది. దానికితోడు మేముగూడ మీ దగ్గరకు వచ్చామంటే మీకెంత కష్టమో ఆలోచించండి" అన్నా.

"కష్టమేమిటి? డాక్టరుగా వుండే వాళ్లు అవన్నీ పెట్టుకుంటే లాభం లేదండీ. ప్రస్తుతం డాక్టరుగారు లేనందువల్ల మీరు నా దగ్గరకు రావలసివచ్చింది. నేను లేనప్పుడు హాస్పిటలుకు వచ్చే స్త్రీలందరూ డాక్టరుగారి దగ్గరకు పోవాలిగదా. ఇక్కడ మేమున్నంత కాలం రోగులకేమీ కష్టం రాకూడదు. కాబట్టి మీరేమీ అలాగ ఫీలవవలసిన అవసరంలేదు. ఇప్పుడేగాదు. ఎప్పుడైనా మీరు తరచు వస్తూండండి. మీరున్నారుగా రామారావుగారు. ఇద్దరూ కలిసొస్తూండవచ్చు" అని చెప్పి మందు రాసి ఇచ్చింది.

"అలాగేనండి. ఇక సెలవు పుచ్చుకొంటాం" అని లేచి వచ్చేశాం. నాకామెను గురించి చాల సదభిప్రాయం కలిగింది ఆ కాసేపట్లో. హాస్పిటలుకు వచ్చిన రోగులు అరమరికలేకుండా, బిడియపడకుండా తమ వ్యాధుల్ని గురించి చెప్పుకునేట్లు జేసే ముఖలక్షణాలున్నాయి ఆమెలో. ఆకాసేపూ రామం ఎక్కువగా మాట్లాడలా. మా మాటలు వింటూ కూర్చున్నాడు.

ఒకనాడు ముగ్గురం తీరిగ్గా పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ కూచున్నాం. మా సంభాషణలో దేశంలోని ప్రస్తుత రాజకీయపరిస్థితుల్నీ, ప్రభుత్వపు ఆర్థిక దుస్థితినీ, ఆహార విషమ పరిస్థితినీ పూర్తిగా సమీక్ష చేసేశాము.

దినాలు గడిచే కొద్దీ మాకు పూర్తిగా చనువేర్పడిపోయింది. రామారావున్నా లేకపోయినా రెండుమూడు రోజుల కొకసారి పోయి ఏదో కొంతసేపు మాట్లాడి వస్తూండేవాణ్ణి. క్రమంగా ఆమె వివరాలన్నీ తెలిసొచ్చాయి. మంచి గౌరవనీయమైన కుటుంబానికి చెందిన బాలిక. పెండ్లికాలేదు. వయస్సు పాతిక సంవత్సరాలలోపు. పేరు జ్యోతిర్మయి. తల్లిదండ్రులకు తానొక్కతే కూతురు. తల్లి చనిపోయింది. తండ్రిమాత్రం తనదగ్గరే వున్నాడు. దినాలుగడిచే కొద్దీ నా కామెమీద ఒక విధమైన ప్రేమ ఏర్పడింది. దాన్ని సోదరప్రేమా లేక ఇంకేదైనా ప్రతిఫలాన్నాశించే ప్రేమా?

అంటూ[illegible]. ఆ విషయం ఆ పరిస్థితుల్లో అడిగితే నేనేం చెప్పలేక పోయేవాడిని. అదేదో ఆమె అంటే ఒకరకంగా సంతోషంగా వుండేది. అంతకంటే నేనేం జెప్పలేను. రామం ఆమె విషయాన్ని ఎత్తితే సరి చెవి కోసుకునేవాడు.

ఒకరోజు రామం, నేనూ నాగదిలో కూర్చొని మాట్లాడుకుంటున్నాం. రామం మాట్లాడుతూ మాట్లాడుతూ "ఒకేయి ఒక ముఖ్య విషయంలో నీ సహాయం కావాలిరా" అన్నాడు. "నా సహాయమా ? దానికేం ? అసలు సంగతేమిటి?" అన్నా.

"ఏమీలేదురా. మన వూరి హాస్పిటలులో వున్న లేడీ డాక్టరునుగురించి నీ అభిప్రాయ మేమిటి?"

"లేడీ డాక్టరునుగురించా? నా అభిప్రాయమా? ఏ విషయంలో?"

"గుణగణాలురా"

"గుణగణాలకేం? ఆ మెలో వేలె త్తి చూపించటానికి చెడ్డగుణము మచ్చుకు గూడ ఒకటిలేదు. ఏం? గుణగణాలు విచారిస్తున్నావ్? సంగతేమిటి?"

"అహ-ఏమీలేదు. ఆమె ఒప్పుకు నే పక్షంలో వివాహమాడా లనుకుంటున్నా. అందుకు నీ సహాయం కావాలి."

"బలే వార్త చెప్పావురా. ఈ విషయంలో నాశక్తివంచన లేకుండా సహాయం చేస్తాను. అసలింతకూ ఆమెదగ్గర ఈవిషయం ఎప్పుడైనా కదిపావా? లేదా?"

"అబ్బే. ఇంతవరకూ లేదు, నా తరపున నీవే అడగాలి. అంతవరకే నీ సహాయం."

"నేనా ? నే నడగటం బాగుంటుందం టావా?"

"బాగుండడ మేమిట్రా? మన మేం దురుద్దేశంతో అడుగుతున్నామా?అంగీకరిస్తే సేగదూ."

"సరే. వీలున్నపుడు కదిపి చూస్తానులే" అన్నా.

తర్వాత రెండురోజులకు ఆమె ఇంటికివెళ్లా హాస్పిటలునుండి అప్పుడే తిరిగి వచ్చినట్లుంది. వెళ్ళగానే "రండి రండి. రెండురోజుల నుండీ కనిపించటంలేదే, ఎక్కడకైనా వెళ్ళారా" అంటూ కుర్చీ నొకదాన్ని నాదగ్గరకు లాగింది. నేను కూర్చుంటూ "అబ్బే ఎక్కడికీ వెళ్లలేదు. ఏదో పని తీరుబడికాలేదు" అన్నాను. "లెక్చరరకు తీరుబడి కాకపోవట మేమిటండీ. చాలా తీరికగావుండే వుద్యోగమది. ఉండండి. ఇప్పుడే వస్తా" అంటూ లోపలికెళ్ళింది. అయిదు నిమిషాల తర్వాత రెండు కప్పులతో టీ పట్టుకొచ్చింది. "ఎందుకండీ మీ కనవసర శ్రమ" "శ్రమేమిటి ? ఫరవాలేదు. పుచ్చుకోండి" అంటూ అందించింది. టీ తాగుతూ "మీ నాన్నగారు కనిపించరే" అన్నా. "షికారుకు వెళ్ళినట్లున్నారు" అంది. రామం విషయం ఇపుడే కదిపిచూద్దామా అనిపించింది. ఆ విషయాన్ని మన మెత్తడం మంచిదా కాదా అని ఆలోచించా. దానిలో తప్పేముంది ? నా విషయం కాదుగదా. స్నేహితుడి విషయంలో అనుమానించడం అనవసరం కాబట్టి అడుగుదామనుకున్నా. నేనీ ఆలోచనల్లో వుండగానే ఆమె ప్రశ్నతో మెలకువ వచ్చినట్లయింది. "ఏమిటండీ. ఏదో ఆలోచిస్తున్నారు. టీ చల్లారి పోతున్నది. త్వరగా తాగండి" అంది. "ఆ. ఆ. తాగుతున్నాను. ఆలోచన ఏమీ లేదండి. ఒక విషయం మిమ్మల్నడుగుదామని."

"నన్నా? అడగండి. దానికంత ఆలోచన ఎందుకు?"

"ఏమీలేదు. మీ వివాహం విషయం" అన్నా. నేను వివాహం విషయం ఎత్తగానే ఆమెకు సిగ్గు దొంతరలుగా ముంచుకొచ్చినట్లయి చిరునవ్వు నవ్వుతూ తల వంచుకొంది. "నా వివాహ విషయం మా నాన్నగారితో సంప్రదించటమే మంచిదనుకొంటా" అంది మెల్లగా. "అయినామీ సమ్మతం అవసరంకదా. చూడండి రామారావు చాల ఆస్తిపరుడు. బి. ఏ. వరకు చదువుకున్నవాడు. అందానికేం కొరవలేదు. దుర్గుణాలేమీ లేవు. మిమ్మల్ని వివాహమాడాలని వుబలాట పడుతున్నాడు. ఆ విషయం అడుగుదామనే నేను వచ్చాను." నేనీ మాటలు ముగించి ఆమె ముఖంలోకిజూసి నిశ్చేష్టుణయ్యా. నా ముఖంలోకి వెర్రిగా చూస్తూంది. వెనుకటి చిరునవ్వేమీలేదు. ముఖం లోని రక్తమంతా పీల్చుక పోయినట్లుగావుంది

కొంచెం సేపటికి తెప్పరిల్లుకున్న తర్వాత తలవంచుకుని "రామారావుగారిని వివాహ మాడాలనే భావం నా కెప్పుడూ కలగలేదు. అంతే. వారిలో చెడ్డగుణాలున్నాయని కాదు నే ననేది. ఎందువల్లనో వారిమీద నాకటువంటి అభిప్రాయం కలుగలేదు. ఈ విషయంలో మీతో ఏకీభవించనందుకు క్షమించండి" అంది మెల్లగా. నేనింకేమీ మాట్లాడలేకపోయాను. ఇద్దరం బరువెక్కిన హృదయాలతో అలానే కూర్చుండి పోయాం.

రామంతో ఈవిషయాన్ని నేనుచెప్పినపుడు వాడు చాలా బాధపడ్డాడు. అయినా చదువు కున్నవాడు గాబట్టి వివాహ విషయాల్లో బల వంతాలు వుండకూడదంటూ "ఒరేయ్! ఆమె నిన్నైనా చేసుకుంటుందేమో కనుక్కోం దామా?" అన్నాడు. "ఛా ఛా వూరుకో. ఎవరైనావింటే నవ్విపోతారు. నీమీద ఆభావం లేదన్నపుడు నామీద వున్నట్లా? ఆమెతో ఈ విషయం ఎత్తేవు కొంపదీసి. ఆమెకు మన మీద చెడ్డ అభిప్రాయం ఏర్పడగలదు" అన్నా. "అబ్బాయి! అవన్నీ నాకొదిలేయి. నీ కిష్టమా కాదా? ముందా విషయం చెప్పు" "మన కిష్ట మయితే మాత్రం ఆమె ఇష్టపడవద్దా రామం. అసహ్యంగా వుంటుంది. ఆమె దగ్గిర ఈ విషయం ఎత్తబోకు" అన్నా. వాడేమీ పల క్కుండా నవ్వి వూరుకున్నాడు.

తర్వాత రెండుమూడు రోజులకు గాబోలు కాలేజీకి టైమయిందని హడావుడిగా బయలు దేరుతున్నా. ఇంతలోనే రామం వూడిపడ్డాడు హడావుడిగా. దబదబ శబ్దం చేసుకుంటూ లోపలికొచ్చి "ఎక్కడకోయ్ బయలుదేరు తున్నావ్? కాలేజీకా? సెలవు గీకిపారేసి స్నేహితులందరికీ టీపార్టీ చేయించు" అన్నాడు.

"ఏమిట్రా ఈ గభసంతా? ఎందుకూ? వివాహమేమైనా నిశ్చయమయిందా ఏం?"

"మరేమనుకున్నావ్? జ్యోతిర్మయీ దేవి గారు తమర్ని వివాహమాడడానికి అంగీకారం తెలిపారు. మన స్వయంవరం అడ్డం తిరిగింది. ముందొచ్చిన చెవుల కంటే వెనుక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్లు నా ద్వారా ఆమెకు పరిచయమయిన వాడివయినా, నీ గుణాలు ఆమెమీద గొప్పగా పనిచేసినయ్. ఇంకెందుకు ఆలస్యం? సెలవుకాగితం గీకిపారేద్దువుగానిరా" అంటూ నవ్వుతూ డ్రాయింగు రూములోకి లాక్కువెళ్లాడు నన్ను.

నేటి మన బతుకు

# ఊబిలోకి....

## "ఉద్యోగి"

ఆఫీసువేళ కావస్తోంది. పీడు అన్నానికి కూచున్నాడు. అన్నంలోకి తోటకూర ఇగురూ, చింతపండు పచ్చడీ, నీళ్ల చారు.

"ఏమే, కాస్త పప్పు వెయ్య లేకపోయినా ఈ తోటకూరలో? రాత్రికూడా పనికొచ్చు నుగా?"

"రెండు పప్పులూ పట్టుకురావాలి."

గ్రహించుకున్నాడు. ఇంకో వారం రోజు లకు జీతం రానేవస్తుంది. ఏకంగా పప్పులు అప్పుడే తెచ్చుకోవచ్చును.

"తోటకూర పులుసుచేసినా బాగుండేది."

"చింతపండు పచ్చడీ, మళ్ళీ పులుసూనా అని ఆక్షేపించరూ?... కాకపోయినా పప్పు బద్దలు కనిపించకపోతే ఆకుకూర పులుసు ముట్టరుగా?"

ఏదో ఒకటి పొట్టకింత. మధ్యాన్నం దాకా మళ్ళీ ఆకలి కాకుండా చూసుకోవాలి మరి. కాకపోయినా-ఎందుకనుకోవటం?

చిత్రం. నిరుడూ ఇదే సంపాదనగదా, తిండి కింత ఇబ్బంది పడలేదు. జీతం రాగానే కొని